

**ఈ వారం కథ**

- లంకపల్లి సంపత్‌కుమార్





# మూడో కోణం ప్రేమ!

**'రెండో పెళ్ళివాడ్ని ఎలా ఇష్టపడ్డావేమిటీ... మరీ... అంత చీప్‌గా' అంది సుమ విసుగ్గా.**

**'అతను రెండో పెళ్ళివాడే కాదు... ఇంటర్ కాస్ట్ కూడా' అంది వీణ నవ్వుతూ.**

'ఓహో... అది కూడా వుందా... ఇంకా ఏమైనా...' అంది వ్యంగ్యంగా సుమ.

'నీకు అది అంత అవసరమా?' అంది వీణ ఆలోచనగా.

'ఏదో ఫ్రెండ్‌వి. నీవున్న వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లో రూమ్ ఇప్పించమంటే అన్ని సంగతులు అడుగుతావేం?' అంది మళ్ళీ.

'నేనంటే... పల్లెటూరి నుంచి పట్నం వచ్చిందాన్ని. ఎవ్వరూ బంధువులు లేకపోతే హాస్టల్‌లో వుంటున్నా. ఇక్కడున్న వారంతా అంతే. కాని సొంత ఇల్లు, తల్లిదండ్రులు... అందర్నీ ఉంచుకొని ఏంటే... హాస్టల్‌లో ఉంటానంటావ్' అంది సుమ దబాయిస్తూ.

'ఇంట్లో అతని విషయం తెలిసింది. నీకు పెళ్ళి కావాలనుకుంటే ఎన్నో మంచి సంబంధాలు వస్తున్నాయి. పెళ్ళి చేస్తామంటే ఇప్పుడే వద్దు... ఉద్యోగంలో సెటిలయ్యాక చేసుకుంటానని చెప్పావ్. ఇప్పుడేమో... అని కోప్పడుతున్నారు' అని జరిగిన గొడవంతా చెప్పింది.

'అంటే మీ వాళ్ళకు... రెండో పెళ్ళివాడ్ని చేసుకోవడం ఇష్టం లేనపుడు... ఎందుకు కష్టపెట్టడం. హాయిగా... వాళ్ళు చూసిన వాడ్నే... మధ్యలో నీవంటే ఎంతగానో పడి చస్తున్నాడని చెప్పాడే... అతడినో...' సుమ ఇంకా చెప్పబోతుంటే 'నీ సహాయం కోరితే ఇంత క్లాసు పీకుతావా... ఇక్కడ కాకపోతే మరో చోట చేరతాను. కాని... ఆయన్ని ఏమీ అనకు. అస్సలు ఈ విషయం అతనికి తెలీదు' అంది వీణ కూల్‌గా.

'వ్వాట్...' అదిరిపడింది సుమ. 'ఇదెప్పటి నుండే బాబు... అంతా వన్‌సైడెడ్ లవ్ అన్నమాట' అంది మరీ ఆశ్చర్యంగా.

'మీ వాళ్ళు వచ్చి... నాతో గొడవ పెట్టుకుంటే ఏం చెప్పాలో అర్థం కావడంలేదు. దీని వెనక నేనూ ఉన్నాననుకుంటారు. నీ పుణ్యమాని అప్పుడప్పుడు మీ ఇంట్లో హోమ్లీఫుడ్ దొరికేది. అదీ పోయింది...' అంది సుమ విచారంగా.

'హోమ్లీఫుడ్ పోయిందని ఏడుస్తున్నావా... ఓవైపు నేను టెన్షన్‌తో ఛస్తుంటే..' అంది వీణ కోపంగా.

'అంత కోపం వద్దు... నీ ఇష్టమున్నన్ని రోజులు ఉండు. కాని పెళ్ళి చేసుకునేప్పుడు మాత్రం నాకు కాస్త ముందుగా చెప్పు. నిద్రొస్తోంది. నీ నిర్ణయం ఎలాంటిదైనా... నీ ఫ్రెండ్‌గా తప్పదుగా' అని ముసుగుకప్పి నిద్ర నటించసాగింది.

ఆలోచనలలో పడిపోయింది వీణ. తనకు తెలుసు. సుమ నిద్రపోకుండా తన గురించే ఆలోచిస్తుందనీ. అతనితో ఈ విషయం చెప్తే... చాలా తప్పు చేశావ్. బుద్ధిగా మీ వాళ్లు ఎవర్ని చూపిస్తే వారిని చేసుకో. లేదంటావా... నీకెవరైనా ఇష్టముంటే చెప్పు నేను దగ్గరుండి పెళ్ళి జరిపిస్తా అంటాడు. ఆ మాటలు మనసులో మెదలగానే పెదవులపై చిరునవ్వు మెరిసింది. అతను ఏం చేస్తుంటాడో... అనుకుంటూ నిద్రలోకి జారింది.

కంప్యూటర్స్‌లో పోస్టుగ్రాడ్యుయేషన్ అయిపోగానే... పిల్లల కోసం ప్రైమరీ పుస్తకాలు ప్రచురించే ఓ బుక్ పబ్లికేషన్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. అక్కడ పుస్తకాల ప్రూఫ్‌రీడింగ్ అవీ చేయాలి. తర్వాత టెక్స్ట్ మేటర్ అంతా కంప్యూటర్‌లో ఫీడ్ చేయడం లాంటి ఉద్యోగం. చాలామందిని సెలెక్ట్ చేశారు. ఓ ఆర్నెల్ల పాటు అప్రెంటిస్ చేయాలన్నారు. కొన్ని బ్యాచ్‌లు చేశారు. ప్రతీ బాచ్‌కు ఒక్కో ఇన్‌స్ట్రక్టర్. తన బ్యాచ్ ఇన్‌స్ట్రక్టర్ - సునీల్! ముసలాయన అనుకుంది. కాని ఎంతో సరదాగా ఉండే జల్సా పురుషుడు అనుకోలేదు. అతనిలోని డిగ్నిటీ చూసి ఆశ్చర్యపోయింది. 'నువ్వేం బెరుకుగా ఫీలవసరం లేదు. ఇక్కడ అందరం ఒకటే. త్వరత్వరగా పని నేర్చుసుకో.' అన్నాడు సునీల్ నవ్వుతూ. తన బ్యాచ్‌లోని మరో అమ్మాయి ఏదో కారణాలవల్ల రెండు నెలల తర్వాత జాయినవుతానందట. ఇక తను ఒక్కతే. అతనే అన్నీ నేర్పించాలి. తొందరలోనే చాలా విషయాలు తెలుసుకుంది. సునీల్‌కు పెళ్ళయిందనీ... ఏవో కారణాలవల్ల భార్య అతన్నుంచీ విడిపోయిందనీ... బహుశా ఆ బాధను మరచిపోవడానికే అందరితో సరదాగా ఉంటాడనుకుంది. అతను చాలా ఇంటలిజెంట్. అప్పుడప్పుడు లంచ్ టైంలో పని ఎక్కువగా ఉంటే అతను బయటకి వెళ్ళి హోటల్‌లో భోంచేయడానికి వీలుకాదు. 'హలో... గర్ల్స్... కాస్త నాకూ మిగల్చండి. వీలయినప్పుడు లాగిస్తాను' అని చనువుగా అందరితో కలిసి భోంచేస్తాడు. 'హలో వీణ... ఏం తీసుకువచ్చారు ఇవ్వాళ' అని చనువుగా తన బాక్స్‌లోని చపాతీలు తీసుకుని తినడం చూసి... అవి ఎంగిలి అనబోయి ఊర్కుంది. ఓరోజున 'మీ భార్య మీనుంచి ఎందుకు దూరంగా వెళ్ళిపోయింది' అని అడిగింది. అతనేం మాట్లాడలేదు కాస్సేపు. ఆ తర్వాత - 'నేను ఆమెకు సరిపోయి ఉండకపోవచ్చు. అయినా నా విషయం అంత అవసరమా నీకు?' అన్నాడు. దాంతో తను ఏమీ మాట్లాడలేక పోయింది. అతను తన మీదుగా వంగి కీబోర్డును నొక్కుతూ తను చేసిన తప్పులు సరిదిద్దుతుంటే... అతనికి దగ్గరగా తను. ఆ సామీప్యం నాకిష్టం. అతని ఎదకు దగ్గరలో తన తల... ఎందుకో అతని సమక్షంలో తన ఆలోచనలు

వేరుగా ఉంటున్నాయి. అతను మాత్రం ఏమీ పట్టనట్టే ఉంటాడు.

ఓ రోజు తాను ఆఫీసుకు కొంచెం ముందుగా వచ్చింది. అప్పుడు చూసిందతన్ని. దీక్షగా కంప్యూటర్ ముందు కూర్చుని బిజీగా ఉన్నాడు. అతన్ని చూస్తే, చాలాసేపట్నుంచి అదే పనిలో ఉన్నాడని తెలుస్తోంది. 'ఏమిటి సార్ చాలా సీరియస్‌గా పనిచేస్తున్నారు?' అంది చిలిపిగా. 'తప్పదుగా... మీరు చేసిన తప్పులన్నీ సరిచేస్తున్నాను. చూడు. నువ్వింకా నేర్చుకోవాలి. బాగా తప్పులు దొర్లుతున్నాయి. మేనేజ్‌మెంట్ వాళ్ళు గొడవ పెడతారు. సూపర్‌వైజింగ్ నాకు చేతకావడం లేదో... నువ్వు సరిగా నేర్చుకోవటం లేదో అంటారు. నా మీదైతే కంప్లయింట్ ఉండదు. ఇక నీలాంటి అందమైన అమ్మాయి బాస్‌చేత తిట్లు తినడం ఇష్టంలేక...' అన్నాడు నవ్వుతూ.

'అంటే నాకు ఏమీ రాదా? మీరు నాకు సహాయం చేస్తున్నారా. మీరు నాకు ఏమైనా...' ఆగిపోయింది వీణ.

'ఆగిపోయావేం. నీవేమైనా నా మొగుడివా అంటున్నావేమో. కొంచెం వయసులో పెద్దదానివైతే అలాగే చేసుకుని ఉండేవాడ్ని' అన్నాడు బదులుగా. ఆ మాటలు విని అప్పుడే ఆఫీసులో చేరిన కొంతమంది నవ్వేశారు.

అతని వైపు సీరియస్‌గా చూసింది. అతను ఆ మాటలు ఎలా అన్నాడో తెలీదుగాని తనకు మాత్రం ఎంతో ఇష్టంగా ఉన్నాయి. మళ్ళీ మళ్ళీ వినాలన్పిస్తుంది.

ఆ రోజు వర్షం. తన కిష్టమైన బ్లూకలర్ చుడీదార్ వేసుకుంది. ఆటోలో ఆఫీసుకు వస్తుంటే గాలికి చున్నీ ఎగిరిపోయింది. ఇంటికి వెళ్దామంటే చాలా దూరం. ఏమైతే కానివ్వమని... అలాగే ఆఫీసు చేరుకుంది. 'హలో... ఏదో 'మిస్' అయినట్టుందే' అన్నాడు సునీల్ నవ్వుతూ.

'హార్ట్ మాత్రం కాదు లెండి' అంది తానూ నవ్వుతూ. 'అది ఏ ప్రిన్స్ కొరకో దాచుకోండి. అంత తొందరగా పారేసుకోకండి' అన్నాడు సునీల్. జరిగింది చెప్పింది. ఆ డ్రస్ అంటే తానెంత లైక్ చేస్తుందో కూడా చెప్పింది. లంచ్ టైంలో సునీల్ వచ్చి ఓ పాకెట్ తనకందించాడు. 'ఏంటండోయ్ లంచ్‌కని దోశెలు తెప్పించారా?' అంది పాకెట్ అందుకుని. మీ ఆడాళ్ళకు ఎప్పుడూ తిండి ధ్యాసే. చూడండి' అన్నాడతను. పాకెట్ విప్పింది. తన డ్రస్‌కు మేచ్ అయ్యే బ్లూకలర్ చున్నీ. ఆశ్చర్యపోయింది. ఎంతో సంతోషంతో గుండెలకు హత్తుకుని 'థాంక్స్' అంది అతని చేతులు పట్టుకుని.

'అంత ఎక్సయిట్‌మెంట్ పనికిరాదు. నీ స్థానంలో మరో అమ్మాయి ఉన్నా ఇలాగే చేస్తాను. ఏదో అందమైన అమ్మాయివి. అందరి ముందూ ఇబ్బందిగా ఫీలవుతున్నావని... ఏదో పని మీద బయటకు వెళ్తే గుర్తుకు వచ్చి కొనుక్కొచ్చాను. అంతేగానీ... మరో ఉద్దేశం లేదు' అన్నాడు ఎంతో ఫ్రాంక్‌గా.

అబ్బ... ఎంత సూటిగా చెప్పాడు అనుకుంది. తాను మొదట్నుండీ కోఎడ్యుకేషన్‌లో చదువుకుంది. కాని ఎప్పుడూ మరీ ఇంతగా... మరొకరి దగ్గర చలించలేదు. అతనిలోని ఆ హుందాతనం తనకెంతో ఇష్టం. ఎప్పుడూ తన లిమిట్స్ దాటలేదు. మరొకరైతే మరో విధంగా ప్రవర్తించేవారు. అతను మాత్రం తన మనసులో ఏముందో బయటపడడు. ఎందుకో? తన



'మీ భార్యలాగా మిగతా స్త్రీలు ఉంటారను కోవడం మీకు అలవాట యింది. ఒక్కసారి ఆ ఆలోచన నుండి బయటపడి చూడండి. మిమ్మల్ని ప్రేమించేవారు ఆనం దంగా చూసుకునేవారుంటారని... మీరు చూసే దృష్టిలోనే ఉంది అంతా.' అని కళ్లల్లో నీళ్ళు తిరుగు తుంటే... అతన్ని తప్పుకుని వెళ్లిపోయింది.

మనసు అతని చుట్టే తిరగసాగింది.

'వీణ... మీ ఫ్రెండ్‌తో నా గురించి వివరాలు సేకరిస్తున్నారా' అన్నాడు సునీల్ మరుసటిరోజు.

'అదేమిటీ అలా అడుగుతున్నారు?' అంది ఆశ్చర్యంగా.

'ఏమీ లేదూ. నిన్న మీ ఫ్రెండ్ వచ్చింది. పిచ్చిది మీరంటే ఇష్టం పెంచుకుంది. పెళ్ళి చేసుకుంటారా అని అడిగింది. ఎవరూ అంటే నీ పేరు చెప్పింది. ఆ విషయం నాతోనే అనొచ్చుగా. నీకంతా పెళ్ళిచేసుకోవాలనుంటే చెప్పు. నీకు అన్ని విధాల సరిపోయే వరుణ్ణి వెతికి తెస్తాను. ఐ వాంట్ యు టుబి హేపీ' అన్నాడు.

'ఏం? ఎందుకు హేపీగా ఉండాలి? మీరేమవుతారని అలా కోరుకుంటున్నారు' అంది నిలదీసి.

'అదీ...' ఏదో చెప్పబోయి... మౌనంగా ఉండిపోయాడతను.

'చూడండి సార్. ఒక్కొక్కరిలో తమకు తెలీకుండానే ఇతరులను ఆకర్షించే ఎన్నో లక్షణాలుంటాయి. అందులో కన్నెపిల్లకు పెళ్ళయితే మొగుడు ఇలా తండ్రిలా, స్నేహితుడిగా... ప్రేమగా చూసుకునేవారు కావాలని కోరుకుంటుంది. అది తప్పంటారా?' అంది వీణ.

'ఎలా అంటాను. కాని ఏ నిర్ణయం తీసుకున్నా... ఆలోచించి తీసుకోవాలి. మనసు పారేసుకోవడం మంచిది కాదంటున్నాను. అంతే' అన్నాడు సునీల్.

'మీ భార్యలాగా మిగతా స్త్రీలు ఉంటారనుకోవడం మీకు అలవాటయింది. ఒక్కసారి ఆ ఆలోచన నుండి బయటపడి చూడండి. మిమ్మల్ని ప్రేమించేవారు ఆనందంగా చూసుకునేవారుంటారని... మీరు చూసే దృష్టిలోనే ఉంది అంతా.' అని కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుంటే... అతన్ని తప్పుకుని వెళ్ళిపోయింది.

అతను ఏం చెప్పాలో తోచక అలాగే నిల్చోవడం తెలుసు. అతని హృదయం కరగాలంటే తప్పదు. వీణా... జయించావ్. ఇంకొంచెం... సెంటిమెంట్ పెంచేయ్ మరోసారి. ఎలా ప్రేమించడో చూడు. అతనిలో ఆ సాఫ్ట్‌కార్నర్ చాలు. ప్రేమకు అర్హత అనుకుంది వీణ సంతోషంతో. ప్రేమలో మూడో కోణం ప్రేమ ఉంటుందా... అనుకున్నాడు సునీల్.

★

